www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 08 | నవంబర్ | 2026
పేజీలు : 8

నేడు జిల్లాలో మంత్రులు భట్టి, పొంగులేటి పర్యటన





ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజక వర్గంలో పర్యటించనున్నారు. శని వారం అధికారులతో సమావేశమైన భట్టి ఆది వారం మధిర నియోజక వర్గంలో మా ఇంది రమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో పాల్గొ ననున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియో జక వర్గంలోని కూసుమంచి మండలం పాలేరు, ఖమ్మం రూరల్ మండలం కామంచి కల్, నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామాల్లో మా ఇందరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో పాల్గొననున్నారు.

తీరు మారిన దీపావళి



-పెరుగుతున్న కలియుగ నరకాసురులు
-కృత్రిమ అలింగనాలు.. ఆనందాలే
-పేదోడి పండుగపై ధరల సమ్మెట పోటు

ప్రజాపక్షం/ ఖమ్మం : దీపావళి తీరు మారుతుంది. ఒకప్పుడు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాలతో జరుపుకునే పండుగ నేడు కృత్రిమంగా తయారైంది. ఒక ప్పుడు గ్రామాలకు గ్రామాలే దీపావళి సంబురాల్లో మునిగితేలేది. ఇప్పుడు ఈ వ్యవస్థ కుచించుకుపోయి కుటుంబాలకు, వ్యక్తులకు పరిమితమైంది. అతి ఖరీదైన దీపావళి మందుగుండు సామగ్రిని పెద్ద మొత్తంలో కాల్చడమే దీపావళి పండగను ఘనంగా నిర్వహించుకోవడం అనుకుంటున్నారు. దీపావళి ఆనందోత్సవాలకు ప్రతీక. కష్టాలను అధిగమించి చెడుపై మంచి గెలిచిన సందర్భమిది. కానీ ఇందుకు తద్విరుద్ధంగా జరుగుతుంది. ఇప్పుడు చెడే గెలిచి చెడు సంబురం చేస్తుంది. మంచి రోడ్డెక్కలేక లోలోపలే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీపావళి అనగానే దశాబ్దాల నాటి గుర్తులు జ్ఞప్తికి వస్తున్నాయి. తాటాకు బాంబులు, సీమటపాకాయలు, రోలు రోకలితో పెద్దగా చప్పుడు చేయడం, కాకరపు వ్వొత్తులు కాల్చడం ఇదే అప్పటి దీపావళి. కాకపోతే రంగు రంగుల టపాసులు లేవు. ఖరీదైన దీపావళి సామన్లు కాల్చకపోయినా గ్రామస్తుల మధ్య , కుటుంబ సభ్యుల మధ్య ఎంతో అప్యాయత నడుమ పండుగ జరుపుకునే వారు. ఇప్పుడు ఆ అప్యాయత, అనురాగాలకు దూరమవుతున్నారు. ప్రతి సంబంధం ఆర్థిక సంబంధంగానే మిగిలిపోతున్నది. నరకాసురుడు ప్రజలను ఇబ్బందులు పెడుతుంటే అతన్ని హతమార్చినందుకు దీపావళిని జరుపుకుంటారు. కానీ అప్పుడు ఒక నరకాసురుడే ప్రజలను ఇబ్బందులు పెట్టేవాడు.

మిగతా 2లో..

ముర్రేడు ముంపు ప్రాంతాల్లో
పర్యటించిన కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : ముర్రేడు వాగు వరద ముప్పునకు శాశ్వత పరిష్కారంగా రక్షణ గోడల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ముర్రేడువాగు పై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50.50 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో శనివారం ఆయన సంబంధిత శాఖాధికారులు స్థానిక నాయకులు ప్రజలతో కలిసి వాగు పరివాహక ప్రాంతాల్లో విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. శ్రీనగర్ ప్రశాంతినగర్ సాయినగర్ తదితర ముంపునకు గురైయ్యే లోతట్టు కాలనీలను వాగు పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గత పాలకులు ఈ దీర్ఘకాలిక సమస్యను పూర్తిగా విస్మరించడంతో ఏళ్ల తరబడి భారీ వర్షాలకు వాగు పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు. శ్మశాన వాటికలకు వెళ్లే మార్గాలు సైతం మునకు గురైన కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. ప్రజల కష్టాలను స్వయంగా చూసి

- అధికారులతో రిటైనింగ్ వాల్ మార్గాల పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తాం
- త్వరలో రక్షణ గోడల పనులు ప్రారంభం

మిగతా 2లో..

నేలకొండపల్లి బౌద్ధక్షేత్రానికి మహర్దశ



-టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలి
-అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం
-జాతీయ పురావస్తు శాఖ నిపుణులు వసంత్ షిండే

ప్రజాపక్షం/నేలకొండపల్లి : నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రానికి పర్యాటకంగా కొత్త గుర్తింపు తీసుకొచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ బౌద్ధక్షేత్రాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని జాతీయ పురావస్తు శాఖ నిపుణులు వసంత్ షిండే సూచించారు. బౌద్ధక్షేత్రంతో పాటు బైరాగి గుట్ట, పరిసర ప్రాంతాల్లో ఇటీవల చేపట్టిన తవ్వకాల ప్రదేశాలను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తవ్వకాల్లో వెలుగు చూసిన

మిగతా 2లో..

భార్యను హత్య చేసిన కేసులో భర్త అరెస్ట్

2లో



- గోదావరిలో మృతదేహం లభ్యం
- పోలీసులు అదుపులో నిందితుడు నరేందర్
- వివరాల వెల్లడించిన ఎస్పి రోహిత్‌రాజ్



తీరు మారిన దీపావళి

(మొదటిపేజీ తరువాయి)



కానీ ఇప్పుడు నరకాసురుల సంఖ్య పెరిగిపోయింది. దీపావళికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుడు నరకాసురున్ని సంహరించడం, బలిని విష్ణువు వామన అవతారం ఎత్తి పాతాళానికి అణగదొక్కడం శ్రీరాముడు తిరిగి అయోధ్యకు రావడం, విక్రమార్కుడు పట్టాభిషేకం పొందడం మొదలైన కథల నేపథ్యంలో దీపావళిని జరుపుకుంటారు. ప్రజలను బాధలుపెట్టే వాడు నరకాసురుడైతే ఇప్పుడు నరకాసురుల సంఖ్య కూడా పెరిగింది. ఏదో ఒక రూపంలో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారి సంఖ్య పెరిగింది. ఇప్పుడు నరకాసురుల చర్యలను అరికట్టేందుకు మరింత ప్రయత్నం జరగాల్సి ఉంది. కృత్రిమ అలింగనాలు, ఆనందాలే ఇప్పుడు మిగులుతున్నాయి. పెరిగిన ధరలు పండుగ పూట పేద, మధ్యతరగతి ప్రజలకు ఆనందాన్ని ఇవ్వడం లేదు. ధరలను అరికట్టడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఈ దీపావళి నుంచైనా ప్రజల మధ్య ఆనందాలు వెల్లివిరియాలని, సుఖ సంతోషాలతో గడపాలని పాలకులు సైతం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిసారించాలని ఆకాంక్షిద్దాం. దీపావళికి సంకేతంగా జరుపుకునే ఆచార వ్యవహారాల్లో భక్తితో పాటు సైన్స్ కూడా దాగి ఉంది. ఇప్పుడు టపాసులు పేల్చడం, దీపాలను వెలిగించడం ద్వారా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా క్రిమికీటకాలు నశించి ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుంది. ఎలినినో ప్రభావంతో ఇటీవలి వరకు వేసవి కాలం పరిస్థితులు ఉన్న మురసు తుఫాన్‌తో మళ్లీ వానాకాలం వాతావరణం వచ్చింది. ఈ దీపావళిని సుఖ సంతోషాలు, ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షిద్దాం.

నేలకొండపల్లి బౌద్ధక్షేత్రానికి మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

పురాతన వస్తువులు, చారిత్రక ఆనవాళ్లను పరిశీలించి పురావస్తు శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం బౌద్ధక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బౌద్ధ స్థూపం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన మేరకు ఈ ప్రాంతాన్ని సందర్శించినట్లు తెలిపారు. తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో బయటపడిన చారిత్రక ఆనవాళ్ల పరిరక్షణకు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అమరావతి, విజయవాడ, మధిర, నాగులవంచ మీదుగా గతంలో వాణిజ్య మార్గం కొనసాగినట్లు, ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన నగరంగా విలసిల్లినట్లు తెలుస్తోందన్నారు. బౌద్ధస్థూపం వద్ద ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల ఇక్కడి బౌద్ధ చరిత్ర, ప్రాచీన సంస్కృతి, పురావస్తు విశేషాలను సందర్శకులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధిలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని, వారి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చారిత్రక సంపదను పరిరక్షిస్తూ పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, డిప్యూటీ డైరెక్టర్ పి.నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ గంగాదేవి, మల్లు నాయక్, వేదకుమార్, నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, సిద్ధార్థ ప్రకృతి ఆశ్రమం వైద్యులు కె.వై.రామచంద్రరావు, ఎన్విరాన్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు దుద్దెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన కేసులో భర్త అరెస్ట్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భార్య భవానీని హతమార్చి గోనె సంచిలో కట్టుకుని తీసుకెళ్లి గోదావరినదిలో పడేసిన ఘటనవో నిందితుడైన భర్త ఏఆర్ కానిస్టేబుల్ బోడా నరేందర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితున్ని శనివారం త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పి రోహిత్ రాజ్ మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 3వ తేదిన భవాని భర్త నరేందర్ రాత్రి 8గం. సమయంలో భవానీని చేతులతో నులిమి చున్నీతో గొంతుబిగించి హత్య చేసినట్లు పోలీసులు విచారణలో నరేందర్ ఒప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని తెల్లని సంచిలో ఉంచి తన స్వగ్రామమైన గోలియా తండాకు తీసుకెళ్లి తన తండ్రి హరిలాల్ సహాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టినట్లు వెల్లడించాడు. ఆ తర్వాత 4వ తేది రాత్రి 11 గం. సమయంలో మృతదేహాన్ని భద్రాచలం గోదావరి బ్రిడ్జీ వద్దకు తీసుకెళ్లి నదిలో పడేసినట్లు విచారణలో తెలిపాడు. నేరానికి సంబంధించి సాక్షాలు మాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ చర్యకు పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుడు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసులు గోదావరి నదిలో గాలింపు చర్యలు చేపట్టి భవాని మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసులో హతురాలి భర్త బోడా నరేందర్‌ను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలికితీసేందుకు తదుపరి విచారణ కొనసాగుతోందని, నేరంతో ప్రమేయం ఉన్నవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి రోహిత్ రాజ్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు త్రీటౌన్ సిఐ జితేందర్ అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయ్ సింహారెడ్డి త్రి టౌన్ ఎస్ఐ రమేష్‌తో పాటు పోలీస్ సిబ్బందిని ఎస్పి అభినందించారు.

పార్టీలకు అతీతంగా
ఇందిరమ్మ జీవిత భీమా పథకాన్ని అమలు చేయాలి



దరఖాస్తు గడువును పొడిగించాలిః యామాల గోపాలరావు

ప్రజాపక్షం/వైరాః తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.5ల క్షల ఇందిరమ్మ జీవిత భీమా పథకాన్ని పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని ప్రతి అర్హులైన రేషన్‌కార్డు లబ్ధిదారునికి వర్తింపజేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యామాల గోపాలరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో ఇందిరమ్మ జీవిత భీమా పథకానికి ఆమోదం తిలిపి జీవో విడుదల చేయడం అభినందనీయమన్నారు. అయితే ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల20 నుంచి 30వ తేదీ వరకు మాత్రమే గడువు ప్రకటించారని, అర్హులైన ప్రతిఒక్కరికి అవకాశం కల్పించేందుకు దరఖాస్తు గడువును మరింత పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలు బాధ్యతలను గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీలకు అప్పగించాలనే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని, అలా చేస్తే గ్రామాల్లో రాజకీయ విబేదాలు తలెత్తే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజలు నివసిస్తున్నందున ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులందరికి పథకం అందేలా చర్యలు తసీఉకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేకంగా దరఖాస్తు ఫారాన్ని రూపొందించి గ్రామపంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులను గుర్తిస్తే పథకం పారదర్శకంగా అమలవుతుందని, రాజకీయ వివాదాలకు తావుండదని పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ప్రాధాన్యత ఉందని, ఇతర పార్టీలకు చెందిన వారికి తగిన ప్రాతినిధ్యం లేదని ఆయన విమర్శించారు. అందువలన పథకం అమలు బాధ్యతలను ప్రభుత్వ అధికారులకు అప్పగించి, అర్హులైన ప్రతిఒక్కరికి న్యాయం చేయాలని యామాల గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గారపాటి అశోక్, మూటా కొండా, కొండా రామకృష్ణ, షేక్ జాని, దారా దివిఆర్ఎస్.రావు, అప్పం సుధాకర్, దారా వెంకన్న, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రేడు ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కూనంనేని

(మొదటిపేజీ తరువాయి)



ముంపు సమస్యకు రక్షణ గోడ నిర్మాణమే శాశ్వత పరిష్కారమని భావించి మూడేళ్లగా నిరంతరం పట్టుబట్టి రూ.50.50 కోట్ల నిధులను తీసుకొచ్చామని చెప్పారు. అంచనాల ప్రకారం పనుల్లో ఎలాంటి రాజీ పడకుండా పటిష్టమైన సాంకేతిక ప్రమాణాలతో రక్షణ గోడ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే పనులకు శ్రీకారం చుట్టి బాధితులకు వరద భయాల నుండి పూర్తి విముక్తి కలిగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గాభివృద్ధికి రాజీలేని రీతిలో నిరంతరం శ్రమిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కూనంనేని వెంట నాయకులు నేరెళ్ల రమేష్ వాసిరెడ్డి మురళీ లగడపాటి రమేష్ చౌదరి మిరియాల రాము నూనావత్ గోవింద్ సపావత్ రవి తో పాటు పలువురు అధికారులు బస్తీల వాసులు పాల్గొన్నారు.

వైరా ఎస్సై పుప్పాల రామారావు బదిలీ



ప్రజాపక్షం/వైరాః వైరా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పుప్పాల రామారావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లాలోని సిపిఎస్ విభాగంలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ వైరా ఎస్సైగా బాధ్యతలు చేపట్టనున్నారు. పుప్పాల రామారావును ఖమ్మం పోలీస్ కమీషనరేట్ కార్యాలయానికి అటాచ్ చేశారు. వైరా ఎస్సైగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పుప్పాల రామారావు శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేశారు. ముఖ్యంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలకు అనుమతి లేకుండా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంలో ప్రత్యేక చొరవ చూపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండుగ కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన బదిలీ కావడంతో వైరా నూతన ఎస్సై ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టనుండటంతో పోలీస్‌శాఖలో ఈ మార్పు చోటుచేసుకుంది.

వైరా ఎస్సైగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/వైరాః వైరా నూతన ఎస్సైగా ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మహబూబాబాద్ జిల్లాలోని సిసిఎస్ విభాగంలో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వైరాకు వచ్చారు. ఈ మేరకు శనివారం వైరా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ



ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కిన్నెర కృష్ణ ప్రారంభించారు. ఈస ందర్భంగా కిన్నెర కృష్ణ మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు అత్యంత అవసరమైన ప్రాణవాయువు అందించడంతో పాటు వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 24% నుంచి 33% కు పెంచే లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం వలన భూగర్భ జలాల సంరక్షణకు, వాయు కాలుష్య నివారణకు, వాతావరణ సమతుల్యతకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతిఒక్కరిక బాధ్యతగా భావించాలని కోరారు. మన వార్డులోని ప్రజలందరూ మొక్కలను పెంచుతూ హరిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కిన్నెర కృష్ణ విజ్ఞప్తి చేశారు.

జానపద ప్రపంచంలో 'బాసింగ బలాలు' గర్జన

142 రోజుల్లో 240 మిలియన్ల వ్యూస్‌తో రికార్డు



ప్రజాపక్షం/సత్తుపల్లిః మండల పరిధిలోని గౌరిగూడెం గ్రామానికి చెందిన బండి సతీష్ రెడ్డి జానపద సంగీత రంగంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఆయన నిర్మాతగా వ్యవహరించిన 'బాసింగ బలాలు' ఫోక్ సాంగ్ యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తోంది. విజయ ప్రొడక్షన్స్ నిర్మాణంలో వేదాస్ మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ పాట కేవలం 122 రోజుల్లో 200 మిలియన్ల వ్యూస్ సాధించగా, 142 రోజుల్లో 240 మిలియన్ల వ్యూస్‌తో మరో మైలురాయిని అధిగమించింది. ప్రస్తుతం తెలంగాణలో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఎక్కడ జరిగినా 'బాసింగ బలాలు' పాట మారుమోగుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విశేష ఆదరణ పొందుతూ జానపద సంగీత రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.ఈ పాట రూపకల్పన కోసం బండి సతీష్ రెడ్డి సుమారు తొమ్మిది నెలల పాటు శ్రమించి, రూ.14 లక్షలు వెచ్చించారు. శేఖర్ వైరస్ కొరియోగ్రఫీ, కళ్యాణ్ కీస్ సంగీతం, స్వామి నరేష్ దుబ్బా రచన, గానం, శ్రీనిధి గాత్రం పాట విజయానికి మరింత ఆకర్షణగా నిలిచాయి. సత్తుపల్లిలోనే విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న బండి సతీష్ రెడ్డి, స్థానిక గ్రామం నుంచి నిర్మాతగా ఎదిగి జానపద ప్రపంచంలో కోట్లాది మంది ప్రేక్షకుల ఆదరణ పొందడం సత్తుపల్లి ప్రాంతానికి గర్వకారణంగా నిలుస్తోంది. ఆయన విజయం స్థానిక యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

పంట నష్టం అంచనాలను తక్షణం రూపొందించండి



-మురసు బాధితులను ఆదుకోండి
-కరువు కాలంలోనూ మంత్రుల దుబారా
-మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు

ప్రజాపక్షం/ ఖమ్మం : పంట నష్టం అంచనాలను తక్షణం రూపొందించి పరిహారం అందజేయాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మురసు తుఫాన్ కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సత్తుపల్లినియోజక వర్గంలోనే 32వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని వారు తెలిపారు. అధికారులు చెబుతున్నట్లు 23140 ఎకరాల్లో నష్టం జరిగిందనడం అవాస్తవమన్నారు. శనివారం స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు మాట్లాడుతూ మురసు తుఫాన్ నష్టంపై మంత్రి వర్గ సమావేశంలో మాట్లాడుతారనుకుంటే అది మరిచిపోయి గ్లోబల్ సమ్మిట్ గురించి మాట్లాడటం శోచనీయమన్నారు. కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, వేంసూరు, అశ్వారావుపేట, ముల్కలపల్లి, దమ్మపేట మండలాల్లో భారీ నష్టం వాటిల్లిందన్నారు. సత్తుపల్లిలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కూడా నీట మునిగాయని అక్కడి ప్రజలు సర్వస్వం కోల్పోయిన ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇంత వరకు పంట నష్టం అంచనాలకు సంబంధించి అధికారులకు ఎటువంటి ఆదేశాలు రాలేదని వారు స్పష్టం చేశారు. ప్రత్యేక యాప్ ద్వారా పంట నష్టం అంచనాలను రూపొందించడంతో పాటు రూ. 50 వేల పరిహారం ప్రకటించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. మంత్రులు కరువు కాలంలోనూ దుబారా చేస్తున్నారని రూ. 10 లక్షల పనులకు శంకుస్థాపనలు చేసేందుకు కూడా హెలికాప్టర్‌ను వినియోగించడం దుబారా కాక మరి ఏమిటని వారు ప్రశ్నించారు. అనర్హులు సైతం హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్నారని సింహం దిగుతుందంటూ పోస్టింగ్‌లు పెట్టడం దేనికి సంకేతమని బిఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. ఎకరాకు రూ. 50వేల చొప్పున తక్షణ పరిహారం ఇవ్వడంతో పాటు దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పత్తి రైతులను తక్షణమే ఆదుకునేందుకు సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, వెంకట్రావు, బొమ్మెర రామ్మూర్తి, సతీష్, బలుసు మురళీకృష్ణ పాల్గొన్నారు.

పంటనష్టంపై సర్కార్ చర్యలు వేగవంతం చేయాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్



ప్రజాపక్షం/కొణిజర్ల : తుఫాన్‌తో నష్టపోయిన పంటల నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు సర్కార్ చర్యలు వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం పిలుపుమేరకు సిపిఐ రైతుసంఘం ప్రతినిధి బృందం కొణిజర్ల ప్రాంతంలో తుఫానుకు నష్టపోయిన పత్తి, వరి పంటలను పరిశీలించారు. తుఫాను వలన పంటలకు చీడపీడలు వచ్చే అవకాశం ఉందని అన్నారు రాష్ట్రంలో పంటలభీమా పథకం ఏర్పాటు చేసి ఉంటే రైతులు వ్యవసాయంలో ధైర్యంగా ఉండేవారని అన్నారు. పంటలకు వెంటనే పంటలభీమా పథకాన్ని ఏర్పాటుచేయాలని తెలిపారు. నష్టపోయిన పత్తి, మిర్చి పంటకు ఎకరానికి రూ 50 వేల రూపాయలు, వరికి రూ 30 వేల రూపాయలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. పంటనష్టపరిహారం ఇవ్వకుండా బ్యాంకులో పంటరుణాలను రీషెడ్యూల్ చేస్తామని చెప్పడం ప్రభుత్వం ఆలోచన సరైందికాదని పేర్కొన్నారు. ఉపాధిహామి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతుకూలీలకు ఉపయోగపడేవిధంగా అమలు చేయాలని కోరారు. పంటలు ధ్వంసం చేస్తున్న కోతుల బెడదను ప్రభుత్వం పరిశీలీన చేసి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ రైతుసంఘం జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, అడపా వెంకటేశ్వర్లు, కొమ్మినేని నరసింహారావు, చింతల ఆదిరెడ్డి, అడపా కృష్ణయ్య, తుప్పతి వెంకటేశ్వర్లు, తద్దె నాగేశ్వరరావు, రొంటె ఉపేందర్, అంబి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్‌తో దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు శ్రీకారం



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : మురసు తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు చెరువులకు గండ్లు పడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చెరువుల శాశ్వత, తాత్కాలిక మరమ్మత్తుల కోసం ఎఫ్‌డిఆర్ నిధుల కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఈ క్రమంలో దమ్మపేట మండలంలో నాలుగు చెరువుల మరమ్మత్తు పనులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. నాగుపల్లి గ్రామంలో ముసలి బంధం చెరువు శాశ్వత మరమ్మత్తులకు రూ.49.50లక్షలు, దమ్మపేట మండల కేంద్రంలోని పేరంటాల చెరువు మరమ్మత్తులకు రూ.47లక్షలు, రాంజీకుంట మరమ్మతులకు రూ.8.50లక్షలు ఆసన్నగూడెం గ్రామంలోని రంగన్నకుంట శాశ్వత మరమ్మత్తులకు రూ.39.50లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తుఫాన్ వల్ల దెబ్బతిన్న చెరువులకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం చూపుతున్న చొరవకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకి ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకి అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

12 అడుగుల కొండ చిలువ ప్రత్యక్షం

చాక చక్యంగా పట్టుకుని అడవిలో వదిలిన అటవీ శాఖ అధికారులు



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని కృషి బైపాస్ రోడ్డులోని ముళ్ల తీగల ఫ్యాక్టరీ సమీపంలో సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు రాత్రి అక్కడికి చేరుకుని కొండ చిలువను సురక్షితంగా పట్టుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, మూడు నెలల క్రితం ఇదే ప్రాంతంలోని ప్లాట్ల సమీపంలో కొండచిలువ సంచారంపై స్థానికులు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా దృష్టికి తీసుకెళ్లగా, వారి సూచనలతో పొదలు, ముళ్లచెట్లను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. తాజాగా మరోసారి కొండచిలువ కనిపించడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై దానిని పట్టుకుని అడవిలో వదిలారు. పాములు కనిపిస్తే ప్రజలు వాటిని పట్టుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్‌లో దీపావళి వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యా విభాగం : స్థానిక శ్రీనగర్‌కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో దీపావళి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు రకరకాల ఆకారాలలో దీపాలను వెలగించి కండ్లు మిరుమిట్లు గొలిపే విధంగా రంగు రంగుల కాంతివంతమైన కాకరవత్తులను వెలిగించి ఒకరోజు ముందుగానే దీపావళికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడతూ దీపావళి పండుగను కాలుష్యరహితంగా, పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. తారాజువ్వలాగా ఆకాశమే హద్దుగా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, మీ భవిష్యత్ అంతా దీపావళి వెలుగుల మాదిరి ప్రకాశవంతం కావడానికి స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ ప్రణాళిక బద్దంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.నురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్లూమింగ్ మైండ్స్‌లో దీపావళి వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం : ఖమ్మంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో దీపావళి పండుగ వేడుకలను విద్యార్థులను, ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు, సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానుద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ దీపావళి పండుగ కేవలం దీపావళి పండుగ మాత్రమేకాకుండా చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని వివరించారు. ప్రతిఒక్కరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి సంబరాలు



ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీనివాసనగర్‌లోని ఎస్వీం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దీపావళిని చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకుంటామని, అలాగే ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, విద్యార్థులందరూ శబ్దకాలుష్యం లేకుండా ప్రకృతిని కాపాడుతూ టపాసులు కాల్చుతూ దీపావళి ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం స్కూల్ ఆవరణంలో విద్యార్థులు సాంప్రదాయ గేయాలు ఆలపిస్తూ దీపావళిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



ప్రజాపక్షం/మధిర: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.శంకర్, డాక్టర్ రామ్మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మోహన్‌నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే సరైన వైద్య చికిత్స ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. పొగాకు, గుట్కా, మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ ప్రతిరోజు వ్యాయామం చేయాలని విద్యార్థులకు సూచించారు. క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. క్యాన్సర్ బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారికి మనోధైర్యం కల్పించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పివో తౌరియా కృష్ణ, కె.గురవయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల సిండికేట్ దందా



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు పట్టణంలోని బాణసంచా దుకాణాలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరు టపాసులు విక్రయదారులకు దీపావళి లైసెన్సులు మంజూరయ్యాయి. దుకాణదారులు సిండికేట్ గా మారి అనుమతులు పొందినట్లు కల్లూరు లో చర్చలు మొదలయ్యాయి. పాతవారికి లైసెన్సులు మంజూరైనట్లు కొత్తవారికి ఒక్కరి ఇద్దరు తప్ప మిగతా వారందరూ పాతవారే నంటూ విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో బినామీ పేర్లతో కూడా అనుమతులు పొందినట్లు పేర్లు ఒకటి షాపులు వేరే వారు కూడా ఏర్పాటు చేసుకున్నట్లు కల్లూరులో ఆ నోట ఈ నోట విమర్శలు మొదలైనాయి. బినామీ పేర్లపై దుకాణాలు బినామీ పేర్లపై బాణసంచా దుకాణాలు దరఖాస్తులు చేయడంతో పోయిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం వేరే వారికి అసలు కన్నా వేరే వారికి షాపులు మంజూరైనట్లు కల్లూరులో చర్చలు మొదలయినాయి. ప్రతి సంవత్సరం వ్యాపారం చేసే వారికే ఈ సంవత్సరం కూడా షాపులు మంజూరైనట్లు పలువురు ఆరోపణలు చేస్తున్నారు షాపుల నిర్వహణలో సిండికేట్ దందా నిర్వహించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అర్హత కలిగిన వారికే దుకాణాలు మంజూరు చేసినట్లు కల్లూరు సాయి కృష్ణారెడ్డికమిషనర్ వివరణ తెలిపారు.

డీవీఆర్ రెగ్యులేటర్‌కు రూ.2.70 కోట్ల ప్రతిపాదనలు



-శిథిలావస్థలో ఉన్న రెగ్యులేటర్ పునర్నిర్మాణానికి చర్యలు
-చెరువుమాధారం చెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ వాసంతి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : చెరువుమాధారం చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన దేవినేని వెంకటరమణ (డీవీఆర్) కెనాల్ రెగ్యులేటర్‌కు కొత్త రూపు రానుంది. రెగ్యులేటర్ పునర్నిర్మాణంతో పాటు కాలువల పటిష్టత, ఇతర మరమ్మతు పనులకు కలిపి సుమారు రూ.2.70 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) వాసంతి శనివారం చెరువుమాధారం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు నీటి నిల్వ సామర్థం, ప్రస్తుత నీటి నిల్వలు, సాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు వద్ద ఉన్న డీపీ ఆర్ కెనాల్ రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరడంతో నీరు వృథాగా పోతున్న విషయాన్ని పరిశీలించారు. ఈ సమస్యపై ఇటీవల పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు రెగ్యులేటర్‌ను పరిశీలించి, నూతన నిర్మాణానికి అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెగ్యులేటర్ పునర్నిర్మాణంతో పాటు కాలువల పటిష్టతకు చేపట్టాల్సిన పనులను కూడా ప్రతిపాదనల్లో చేర్చారు. ఈ పనులు పూర్తయితే నీటి వృథాను అరికట్టడంతో పాటు సాగునీటి సరఫరా మెరుగుపడే అవకాశం ఉంది. అనంతరం మంగాపురం తండాలో ప్రధాన కాలువపై ఉన్న బ్రిడ్జిని సీఈ పరిశీలించారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని, దాని స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి సీఈకి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఈ బ్రిడ్జి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ పొట్టయ్య, ఏఈ నరేష్, కె.దీక్షిత పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి



-అంగన్వాడీ, ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించిన ఎంఎల్ఏ పాయం

ప్రజాపక్షం/బూర్గంపాడు: చిన్నారులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని పినపాక ఎంఎల్ఏ, తెలంగాణ శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని చెరువు సింగారం అంగన్వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా చిన్నారులు, విద్యార్థులతో మాట్లాడి చదువు, విద్యాబోధన, పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీలో అందిస్తున్న పౌష్టికాహారం, ఎంపీపీఎస్ పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో యెదు సింహారాజు, పీఆర్ ఏఈ చక్రధర చారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ సాధన

-ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి
-మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య



ప్రజాపక్షం/కారేపల్లి: భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలర్పించిన కమ్యూనిస్టు అమరవీరుల ఆశయ సాధనకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. సింగరేణి మండలం శనివారం మాస్‌లైన్ గ్రామ కమిటీ నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన స్వర్ణపాక లక్ష్మీ నరసి, పాయం లక్ష్మీ నారాయణతో పాటు విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. నక్సల్బరి నుంచి శ్రీకాకుళం, గోదావరి లోయ తదితర ప్రాంతాలకు విస్తరించిన విప్లవోద్యమంలో వందలాది మంది ప్రజల హక్కులు, భూమి కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, కాను సన్యాల్, చారు మజుందార్ తదితర నాయకుల సేవలను స్మరించారు. పేదలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని, అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని కోరారు. సభకు మాస్‌లైన్ మండల కార్యదర్శి, సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షత వహించారు. డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు గుగులోతు తేజ నాయక్, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌వి రాకేష్, టీయూసీఐ సంయుక్త మండల కార్యదర్శి ధరావత్ సక్రు ప్రసంగించారు. పార్టీ మండల నాయకులు కొలిసెలం శ్రీను, స్వర్ణపాక అనసూర్య, రామారావు, గుమ్మడి ఎర్రయ్య, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయసాధనే నిజమైన నివాళి



-ముత్యాలంపాడులో ఘనంగా సంస్మరణ సభ

ప్రజాపక్షం/ములకలపల్లి: కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పిస్తూ ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఈ సభ జరిగింది. ఈసందర్భంగా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు కల్లూరి కిషోర్ మాట్లాడుతూ దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా సమానత్వ సమాజ నిర్మాణం కోసం జీవితాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రజా విముక్తి, నూతన సమాజ నిర్మాణం కోసం వారు సాగించిన పోరాట స్ఫూర్తికి కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ సంపద, ప్రజల వనరులను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని విమర్శించారు. చమురు, ఖనిజ సంపదతో పాటు విమానాశ్రయాలు, రైల్వేలు, ఓడరేవులు, ఎల్ఐసీ, బ్యాంకులు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ప్రజాశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు కల్లూరి పద్మ, ముత్యాలంపాడు గ్రామ కమిటీ సభ్యులు ఈసం శివ, ఈసం బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తం అందక ఏ ప్రాణమూ పోకూడదు



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: రక్తం అందక పేదలు ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో మెంతిని సాగర్ స్థాపించిన సాగర్ బ్లడ్ బ్యాంక్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ వ్యాప్తంగా ఉచిత రక్తదాన సేవలు అందిస్తోంది. 2026 జనవరి 12న నమోదైన సంస్థ ఇప్పటి వరకు 55 మందికి పైగా రక్తదాన సేవలు అందించింది. సంస్థ బాధ్యులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సల్లూరి మధు, ఉపాధ్యక్షుడు ఇల్లుటూరి మహేష్, ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ బాధ్యుడు వీరంరెడ్డి మహేష్‌రెడ్డి, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి శివరాజ్, హనుమకొండ జిల్లా నియోజకవర్గ బాధ్యుడు విద్యామరి రాజేష్ సేవలందిస్తున్నారు. తలసేమియా చిన్నారులు, ప్రమాద బాధితులు, గర్భిణులు, ఇతర రోగులకు కులమత భేదాలు లేకుండా రక్తదాతలను ఉచితంగా సమకూరుస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు మెంతిని సాగర్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి రక్తదాత ముందుకు రావాలని, ప్రభుత్వంతో పాటు అన్ని వర్గాలు సంస్థకు సహకరించాలని కోరారు. సేవ చేయాలనుకునేవారు పేరు, రక్తపు గ్రూప్, ఫోన్ నంబరుతో సంస్థను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంఎల్ఏ పాయం



ప్రజాపక్షం/బూర్గంపాడు: గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పినపాక ఎంఎల్ఏ, తెలంగాణ శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని ములసమడుగు గ్రామ పంచాయితీ పరిధిలోని చెరువు సింగారంలో రూ 5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని, వర్షాకాలంలో మట్టి రోడ్లతో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు తదితర అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో యెదు సింహారాజు, పీఆర్ ఏఈ చక్రధర చారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: నవంబర్ 15న నల్గొండ ఎన్‌జీ కళాశాల మైదానంలో జరిగే అఖిల భారత రైతు సంఘం(ఏఐకేఎస్)జాతీయ మహాసభల బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీపీఎం దుమ్ముగూడెం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. యలమంచిలి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రైతు సమస్యలు, వ్యవసాయ సంక్షోభం, రైతు హక్కులపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, గిట్టుబాటు ధరలు, రైతు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని నాయకులు కోరారు. ఈసమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మర్కం చంద్రయ్య, కొరసా చిలకమ్మ(రైతు సంఘం మండల కార్యదర్శి), సీనియర్ నాయకుడు బొల్లి సత్యనారాయణ, యలమంచిలి శ్రీనుబాబు, సరియం కోటేశ్వరరావు, సోడి శ్రీను, కొమరం చంటి, సరియం వీర్రాజు, సోయం కనకారావు, ప్రేమ్‌కుమార్, మహేందర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయసాధనకు యువతరం కదలాలి



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారి ఆశయాల సాధనకు యువతరం ముందుకు రావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ దుమ్ముగూడెం మండల కార్యదర్శి సాయన్న పిలుపునిచ్చారు. అడవి రామవరంలో డివిజన్ నాయకుడు సున్నం వీర భద్రం అధ్యక్షతన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాయన్న మాట్లాడుతూ గడీల నుంచి రాజాకారులను తరిమికొట్టి, దొరల భూస్వామ్యానికి వ్యతిరేకంగా, పోడు భూములు, తాగు సాగునీరు, గుడి, బడి, గుడిసెల కోసం పోరాడి ప్రాణాలర్పించిన విప్లవ యోధుల ఆశయాలను కొనసాగించాలని కోరారు. నిర్బంధాలు, దాడులకు ఎదురొడ్డి పోరాడిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సునీత, మారయ్య, రామకృష్ణ, రమక్క, పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/కూసుమంచి: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను సీపీఐ కూసుమంచి మండల సమితి బృందం వివిధ గ్రామాల్లో పరిశీలించింది. ఈసందర్భంగా మండల కార్యదర్శి భూక్యా నరసింహ మాట్లాడుతూ చేతికొచ్చిన వరి పంట నేలకొరిగిందని, పత్తి, మిర్చి పంటలు కూడా దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. ఎలనినో ప్రభావంతో ఇప్పటికే పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎంతో శ్రమించారని, అకాల వర్షాలు వారి కష్టాన్ని వృథా చేశాయని పేర్కొన్నారు. కరువు మండలంగా ప్రకటించినప్పటికీ కూసుమంచి రైతులకు న్యాయం జరగాలని, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకుని పంట నష్టాన్ని అంచనా వేయించి బాధిత రైతులకు తక్షణమే పరిహారం అందించాలని సీపీఐ మండల సమితి డిమాండ్ చేసింది. ఈకార్యక్రమంలో కత్రోజ్, పాండురంగాచారి, భూక్యా వీరన్న, భూక్యా ప్రసాద్, వార్డు సభ్యురాలు భూక్యా శైలజ, భూక్యా రవి, భూక్యా కోడ, భూక్యా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు దీపావళి స్ఫూర్తి



- ప్రజలందరి జీవితాల్లో ఆనందం నిండాలి
- దీపావళి స్ఫూర్తితో ప్రగతి వైపు అడుగులేద్దాం
- కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సమాజంలో నెలకొన్న అన్యాయాలు అసమానతలు అనే చీకట్లను పారద్రోలి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపడమే దీపావళి పర్వదినం పరమార్థమని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌సి కూనంనేని సాంబశివ రావు అన్నారు. పవిత్ర దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కొత్తగూడెం నియోజక వర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజలందరి జీవితాల్లో కష్టాలు కన్నీళ్లు తొలగి పోయి సుఖశాంతులు ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సమాజంలో దోపిడీ పీడన లేని సమాజ స్థాపన కోసం ప్రతీ ఒక్కరూ ఈ పండుగ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి హక్కుల పరిరక్షణకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ కోసం పాటు పడతామని స్పష్టం చేశారు. బాణాసంచా కాల్చే సమయాల్లో చిన్నారులు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి పండుగ ఆనందోత్సాహాలతో జరుపు కోవాలని ప్రభుత్వ శాఖలు పండుగ వేళ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి



- కార్మికుల వాటా చెల్లిస్తున్నా అందని వైద్యం
- రామవరంలో అస్పత్రిని ఏర్పాటు చేయాలి
- ఏఐటియూసి నాయకులు కృష్ణయ్య క్రిష్టోఫర్

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు కొత్తగూడెం కేంద్రంగా ఈఎస్ఐ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని ఏఐటియూసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ క్రిష్టోఫర్ డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రైటర్‌బస్తీ సివిల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు పెద్దపెట్టున నినాదాలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్యం అందించేందుకు ఈఎస్ఐ వాటా చెల్లింపులు ప్రారంభమై ఆరు నెలల గడుస్తున్నా సేవలు ప్రారంభం కాకపోవడంతో శోచనీయమన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల వాటా క్రింద నెలకు రూ.5లక్షలు ఈఎస్ఐకి వెళ్తున్నా ప్రయోజనం శూన్యమని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు జమ అవుతున్నప్పటికీ నేటికీ ఆస్పత్రి ప్రారంభం కాకపోవడంతో వైద్య సదుపాయాలు సంక్షేమ పథకాలు కార్మికులకు దక్కడం లేదని విమర్శించారు. సింగరేణి యాజమాన్యం తక్షణమే ఉన్నతాధికారులతో చర్చించి రామవరంలో ప్రతిపాదించిన ఆస్పత్రిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు మరణిస్తే అందాల్సిన దహన సంస్కార ఖర్చులు ఆరోగ్య సమస్యలు తలెత్తితే రావాల్సిన ఉపయోగాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వీడకపోతే ఏఐటియూసి ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు ప్రభాకర్ లక్ష్మణ్ కళ్యాణ్ రామకృష్ణ సంధ్య బేగం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందులో వరుస ఇళ్ల దొంగతనాలకు తెర



-ముగ్గురు అరెస్టు, రూ 27.51లక్షల సొత్తు స్వాధీనం
-ఎస్పీ రోహిత్ రాజ్

ప్రజాపక్షం/ఇల్లందు: ఇళ్లలో రాత్రివేళ దొంగనాలకు పాల్పడుతున్న ముగ్గురిని ఇల్లందు పోలీసులు అరెస్టు చేసి, రూ 27.51లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ రోహిత రాజ్ వెల్లడించారు. నిందితులు లోడ్ విశాల్ కుమార్(24), గౌతమ్ లోధ్(26), కోరి కళ్యాణ్(20), ఇల్లందులోని 14,15వ నంబర్ బస్తీలకు చెందినవారు. ఇల్లందు, జేకే కాలనీ, సుభాష్‌నగర్, ఆజాద్ నగర్, వెంగళరావునగర్ ప్రాంతాల్లో మొత్తం 10ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారు. వారి నుంచి 165 గ్రాముల బంగారం, 2.205కిలోల వెండి, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ 27.51లక్షలుగా ఎస్పీ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు ఉన్నత విద్య చదివినవారేనని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన క్రైమ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు ఎస్పీ రివార్డు అందించి, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈసమావేశంలో డీఎస్పీ వెంకన్నబాబు, సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం ఆరోపణలపై కదిలిన ఎక్సైజ్ శాఖ

-మంగాపురం తండాలో టాస్క్‌ఫోర్స్ దాడులు
-48 క్వార్టర్ల మద్యం స్వాధీనం, ఒకరిపై కేసు నమోదు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కల్తీ మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని మంగాపురం తండాలో శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 48 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి తండాకు చెందిన కవిత అనే మహిళపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మంగాపురం తండాలో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ధీరావత్ కోటేశ్వరరావు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు సోషల్ మీడియాలోనూ ఈ వ్యవహారాన్ని వైరల్ చేయడంతో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం గ్రామంలో తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో ఓ మహిళ వద్ద సూర్యాపేట జిల్లాకు చెందిన మద్యం బ్రాండ్‌కు సంబంధించి 48 క్వార్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ వేమిరెడ్డి రమ్య తెలిపారు. సోషల్ మీడియాలో కల్తీ మద్యం అంటూ ప్రచారం జరిగిన నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న మద్యం నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించినట్లు సీఐ వెల్లడించారు. పరీక్షల నివేదిక వచ్చిన తర్వాత మద్యం నాణ్యతపై స్పష్టత రానుంది.

రెగ్యులగండిలో గృహ సందర్శన



ప్రజాపక్షం/మణుగూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల వలస ఆదివాసి గిరిజన గ్రామమైన రెగ్యులగండి లో శనివారం గృహ సందర్శన చేసి జ్వర సర్వే నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో, నీరు కలుషితం కావడం, జ్వరాలు రావడం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. అనంతరం జ్వర పీడితుల నుండి రక్త నమూనాలను సేకరించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ , శారదా ఆశ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ, సీఐ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్



ప్రజాపక్షం/మణుగూరు: శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి మరియు సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా మణుగూరు మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో పోలీసులు విస్తృతంగా కమ్యూనిటీ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. మణుగూరు డీఎస్పీ వంగ రవీంద్రరెడ్డి, సీఐ నాగ బాబు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బలగాలు గ్రామంలోని వీధుల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. గ్రామాల్లో గంజాయి రవాణా, విక్రయాలు లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అనుమానితుల వివరాలను పోలీసులకు అందించాలని అధికారులు హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బుగ్గగవాగు రిటైనింగ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలి : కోరం



ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు పట్టణంలోని బుగ్గవాగు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎల్‌సి కోరం కనకయ్య ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఉగాది, మూడు, నాలుగు, ఐదు వార్డుల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ గోడ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులతో మాట్లాడి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు సులభంగా అందించాలనే లక్ష్యంతో బూర్గంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీ రేషన్ దుకాణం నంబర్ 3005020 వద్ద స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, గ్రామ సర్పంచ్ మంద నాగరాజు ఆధ్వర్యంలో అర్హులైన కార్డుదారులకు కార్డులు అందజేశారు. వీటితో రేషన్ పంపిణీలో పారదర్శకత, లబ్ధిదారులకు సౌలభ్యం పెరుగుతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రంగమ్మకు సీపీఐ నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలం బాజుమల్లాయగూడెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ విశ్రాంతి ఉద్యోగి, సీపీఐ గ్రామశాఖ సభ్యురాలు పుసులూరి రంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబాబు, రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకురాలు సీహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా సమితి సభ్యుడు ఉంగరాల సుధాకర్, సర్పంచ్ కోరం కోటమ్మ, నాయకులు భాగం వెంకటేశ్వర్లు, ముత్తినేని మోహన్‌రావు, కట్టికోల వెంకటేశ్వర్లు, దాసరి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ తండాలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

-సర్పంచ్ బానోత్ హీరాలాల్



ప్రజాపక్షం/కారేపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా భాగ్యనగర్ తండాలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. శనివారం గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు సర్పంచ్ బానోత్ హీరాలాల్ తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పెండ్రా అనిల్‌కుమార్, వార్డు సభ్యుడు గాంధీ, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, పంచాయితీ సిబ్బంది హేంచంద్, నంద, రమేష్, రాందాస్, గణేష్, రాధా, లకన్, రాకేష్, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచుతానంటూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నుంచి డబ్బుల వసూళ్లు?



-వైరా మున్సిపాలిటీ మాజీ మేనేజర్‌పై ఆరోపణలు
-జిల్లా అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి



ప్రజాపక్షం/ఖమ్మం : వైరా మున్సిపాలిటీలో గతంలో మేనేజర్‌గా విధులు నిర్వహించి ఐదు నెలల క్రితం బదిలీపై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళ్లిన సుధాకర్‌పై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచిస్తానని నమ్మబలికి ఒక్కొక్కరికి నుంచి తనకు సాధ్యమైనంత మేరకు డబ్బులు తీసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సుధాకర్ వైరా మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేసిన సమయంలో ఈ వ్యవహారం జరిగినట్లు తెలుస్తుంది. అయితే ఆయన బదిలీపై ఖమ్మం కార్పొరేషన్‌కు వెళ్లిన తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు పలుమార్లు కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు బాధితులు ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి ఆయనను కలిసిన సందర్భాలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. తీసుకున్న డబ్బుల్లో కొంత మందికి కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ, మరికొందరికి మాత్రం పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకుండా తిప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పదేపదే డబ్బుల కోసం ఒత్తిడి చేయడంతో మరికొంత మొత్తాన్ని తిరిగి ఇచ్చినట్లు బాధితులు పేర్కొంటున్నారు. మరోవైపు వైరా మున్సిపాలిటీలో ఆయన విధులు నిర్వహించిన సమయంలోనూ పలు వివాదాలు, విమర్శలు ఎదుర్కొన్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి మున్సిపల్ కమీషనర్‌కు వ్యతిరేకంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఏకతాటి పైకి తీసుకురావడం, వారిని తన ఆధీనంలో ఉంచుకునేందుకు 14వ జీవో యూనియన్ పేరుతోప్రలోభాలకు గురిచేసినట్లు కూడా కొందరు ఆరోపిస్తున్నారు. బాధ్యతయుతమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల పెంపు పేరుతో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాస్తవాలను నిష్పక్షపాతంగా విచారించాలని, సంబంధిత అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో న్యూలక్ష్మీపురం కేజీబీవీ బాలికల క్రీడా విజయకేతనం

- రగ్బీపోటీల్లో ఖమ్మం జిల్లాకు ఛాంపియన్‌షిప్ కిరీటం
- అండర్-15లో ప్రథమ, అండర్-18లో తృతీయ స్థానాలు
- ఐదుగురు విద్యార్థినుల అద్భుత ప్రతిభతో జిల్లాకు గర్వకారణం





ప్రజాపక్షం/ముదిగొండ: రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీల్లో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటారు. ఖమ్మం జిల్లా జట్టు తరపున పాల్గొన్న న్యూలక్ష్మీ పురం కేజీబీవీకి చెందిన ఐదుగురు విద్యార్థినులు తమ ఆటతీరుతో జట్టుకు విజయాలు అందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అండర్15విభాగంలో జి.క్రితిక(పదో తరగతి), బీ.కీర్తి(ఇంటర్) అద్భుత ఆటతీరుతో జట్టు విజయానికి కీలకంగా నిలిచారు. ఆరు జిల్లాల జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టు ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. బాలికలు మైదానంలో ప్రదర్శించిన పట్టుదల, క్రీడా నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంది. అండర్18విభాగంలో ఎస్.నందిని(సీనియర్ ఇంటర్), బీ.శ్వేత(సీనియర్ ఇంటర్), ఆర్.లాస్య(పదోతరగతి) తమ ప్రతిభను చాటుతూ జట్టు విజయానికి కృషి చేశారు. ఈ విభాగంలో ఖమ్మం జిల్లా జట్టు తృతీయస్థానం సాధించి పతకాన్ని అందుకుంది. ఒకే విద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రెండు విభాగాల్లోనూ ఖమ్మం జిల్లాకు గుర్తింపు తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యతోపాటు క్రీడల్లోనూ బాలికలు రాణిస్తూ ఉన్నతస్థాయికి ఎదగడం అభినందనీయమని పేర్కొంటున్నారు. న్యూలక్ష్మీ పురం కేజీబీవీ విద్యార్థినుల ఈ విజయాలు ఇతర విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్నిక్రీడా విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు

భార్యను కర్రతో కొట్టి చంపిన భర్త

-అనుమానాస్పద మృతిగా చిత్రీకరించే యత్నం
-పోలీసుల విచారణలో బయటపడ్డ నిజాలు
-భర్తను అరెస్టు చేసిన పోలీసులు



ప్రజాపక్షం/ముదిగొండ: భార్యను కర్రతో కొట్టి హత్య చేసి, ఆ ఘటనను అనుమానాస్పద మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన భర్త బండారం పోలీసుల విచారణలో బయటపడింది. తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో ధర్యాప్తు చేపట్టగా, భర్తే హత్యకు పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో గత నెల 20వ తేదీన సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన పస్తం వెంకటమ్మ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వెంకటమ్మ మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. కుటుంబ నేపథ్యం, ఘటనకు సంబంధించిన పరిస్థితులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించారు. పోలీసులు లోతైన విచారణలో వెంకటమ్మ భర్త లక్ష్మయ్య కర్రతో కొట్టి ఆమెను హత్య చేసినట్లు వెల్లడైంది. అనంతరం ఈ హత్యను అనుమానాస్పద మృతిగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసును సీరియస్‌గా తీసుకున్న ముదిగొండ సీఐ మురళి ప్రత్యేక శ్రద్ధతో ధర్యాప్తు కొనసాగించారు. పోలీసుల విచారణలో లభించిన ఆధారాల మేరకు నిందితుడు లక్ష్మయ్యను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

- పోలీసుల ధర్యాప్తుతో వెలుగులోకి నిజాలు..

మొదట అనుమానాస్పద మృతిగా నమోదైన ఘటనను పోలీసులు సమగ్రంగా విచారించి హత్యగా నిర్ధారించడం చర్చనీయాంశంగా మారింది. నేరం చేసిన వారు ఎంతగా దాచిపెట్టే ప్రయత్నం చేసినా..పోలీసుల ధర్యాప్తు నుంచి తప్పించుకోలేరని ఈ ఘటన మరోసారి నిరూపించింది. కేసును చేధించడంలో చొరవ చూపిన ముదిగొండ సీఐ మురళి, పోలీసు సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

పట్టభద్రుల 1,09,971 మంది

ఎంఎల్‌సి ఓటర్ల దరఖాస్తులు

ప్రజాపక్షం/ ఖమ్మం : త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓట్ల చేర్పింపు ప్రక్రియ శుక్రవారంతో పూర్తయింది. ఖమ్మంజిల్లాలో మొత్తం 1,09, 971 మంది ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 35,163 మంది ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా ఆ తర్వాత స్థానంలో ఖమ్మం రూరల్ 8,383 మంది దరఖాస్తు చేసుకున్నారు. అతి తక్కువగా ఏస్కూరు మండలంలో 2,223 మంది ఎంఎల్‌సి ఓటు కోసం దరఖాస్తు చేశారు. బోనకల్ మండలంలో 2,544 మంది, చింతకాని 2,703 మంది, కల్లూరులో 4,376 మంది, కామేపల్లి 2,930 మంది, కొణిజర్లలో 3,232 దరఖాస్తులు వచ్చాయి. కూసుమంచి మండలం నుంచి 4,026 మంది, మధిర నుంచి 4,682 మంది, ముదిగొండ నుంచి 3,418 మంది, నేలకొండపల్లి నుంచి 3,848 మంది, పెనుబల్లి నుంచి 3,215 దరఖాస్తులు వచ్చాయి. రఘునాథపాలెం మండలంలో 3,946 మంది, సత్తుపల్లిలో 6,156 మంది, సింగరేణి మండలం నుంచి 3,670 మంది, తల్లాడ నుంచి 3,475 మంది, తిరుమలాయపాలెం నుంచి 3,200 మంది, వేంసూరు నుంచి 2,834 మంది, వైరానుంచి 4,326 మంది, ఎర్రుపాలెం నుంచి 2,581 దరఖాస్తులు వచ్చాయి. గతం కంటే ఎంఎల్‌సి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు.

స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో గ్రీన్ దీపావళి



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో శనివారం కాలుష్య రహిత, పర్యావరణ హిత గ్రీన్ దీపావళి వేడుకలను సంబురంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని రంగు రంగుల ముగ్గులతో, పూలతో అందంగా అలంకరించారు. నూనె ప్రమీదలను వెలిగించి దీపావళి వేడుకలను ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ దీపావళిని పర్యావరణ హితంగా జరుపుకోవడం ఇప్పుడు అత్యంత ఆవశ్యమన్నారు. చెడుపై మంచి విజయానికి గుర్తుగా జరుపుకుంటున్న దీపావళి ప్రతి ఇంట సుఖ సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా

ప్రజాపక్షం/ ఖమ్మం : యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్న రైతును పట్టించుకునే తీరిక లేకుండాపోయిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మురసు తుఫాన్ కారణంగా ఖమ్మం జిల్లాలో ప్రాథమికంగా 83వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఇందులో అత్యధికంగా పత్తి 50వేల ఎకరాల్లో, 25వేల ఎకరాల్లో వరి, ఎనిమిది వేల ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతిన్నదన్నారు. జిల్లాలో జరిగిన ఈ పంట నష్టానికి సంబంధించి తక్షణం ప్రత్యేక యాప్ ద్వారా అంచనా వేసి వరికి ఎకరానికి రూ. 30వేలు, వాణిజ్య పంటలకు రూ. 50వేల చొప్పున ఇవ్వాలని నున్నా డిమాండ్ చేశారు.

వీబీజీరాంజీ అమలులో మేట్లు కీలకం



ప్రజాపక్షం/చింతకాని : వీబీజీరాంజీ పథకం అమలులో మేట్లు కీలకమని చింతకాని ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు తెలిపారు. చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిక చేసిన 26 గ్రామపంచాయతీల మేట్లకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించడం, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరవేయడం వంటి పనుల్లో మేట్ల పాత్ర క్రియాశీలకమని తెలిపారు. కూలీల హాజరును సక్రమంగా నమోదు చేస్తూ పని ప్రదేశంలో సూచనలు ఇవ్వడంతో పాటు ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని చెప్పారు. కూలీలకు తాగునీటి, నీడ తదితర సదుపాయాలు కల్పిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కోటయ్య, టీఏలు, మేట్లు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాలి



ప్రజాపక్షం/చింతకాని : దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలని చింతకాని ఎస్సై జి నరేష్ దుకాణదారులకు సూచించారు. మండలంలో అనుమతి పొందిన ఏడు దుకాణాలను ఎస్సై నరేష్ శనివారం రాత్రి సందర్శించి పలు సూచనలు చేశారు. దుకాణాల వద్ద ఎలాంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దుకాణాల వద్ద ఇసుక, నీటి డ్రమ్ములను అందుబాటులో ఉంచుకోవాలని, అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే నియంత్రించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్ , బీడీలు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత దుకాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆక్రమణలపై వ్యాపారం..చిరు వ్యాపారులపై భారం..!

-కళ్లుండి చూడలేని రోడ్డు భవనాల శాఖ
-డ్రైనేజీ ఆక్రమణలను చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న పంచాయతీ శాఖ
-హద్దులు పెట్టి మరిచిన మండల అభివృద్ధి శాఖ
-కలెక్టర్ సారూ మీరైనా స్పందించండి అంటున్న ప్రజలు







ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. సైడ్ డ్రైన్ లు, రోడ్లను పెద్ద వ్యాపారులు ఆక్రమించి చిరు వ్యాపారులకు అధిక ధర లకు అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన రహదారిని ఆక్రమిం చడంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర అవుతున్నది. సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంతో సామాన్య ప్రజలు, వాహనదా రులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమ స్యను ఎదుర్కొంటున్నారు. ఏ వైపు చూసినా రోడ్డుకు ఇరువైపులా ఆక్ర మణలే కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారి పోలీస్ స్టేషన్ నుంచి సాయిబాబా ఆలయం వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు, అదే విధంగా బస్ స్టాండ్ సెంటర్ నుండి జూలూరు పాడు గ్రామంలోకి వెళ్లే రావిచెట్టు బజారు, జూలూరుపాడు హరిజన వాడకెళ్లే రహదారి ఇరువైపులా వ్యాపారస్తులతో పాటు గృహ సముదా యాలు ఉన్న వారు యథేచ్ఛగా రోడ్డుని ఆక్రమించుకున్నారు. ఇంకొంత మంది వ్యాపారస్తులైతే ఏకంగా తమ షాపుల ముందున్న మెయిన్ రోడ్డు స్థలాలను సైతం తోపుడు బళ్లు వారికి అద్దెలకు ఇస్తు అమాయక చిరు వ్యాపారస్తులను దోచుకుంటున్నారు.

మంత్రులు, ఉన్నతాధికారుల పర్యటనలోనూ ట్రాఫిక్ సమస్యలే..

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి, గతంలో మంత్రులు, డీజీపీ లాంటి ఉన్నతదికారుల పర్యటనలో ట్రాఫిక్ సమ స్యలు టాలెత్తిన సందర్భాలు ఉన్నాయి. మరోపక్క కాలువలను ఆక్రమిం చుకోవడంతో వాటి గుండా పోవాల్సిన నీరు వెల్లక ఎక్కడికక్కడ మురుగు పేరుకు పోవడంతో ప్రజలు రోగాలు బారిన పడడం సహ జంగా మారిపోయింది. ఇంత జరుగుతున్నా అటు ఆర్అండ్బి అధికా రులు గానీ ఇటు పంచాయతీ అధికారులు రోడ్డు ఆక్రమణకు గురి అవుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇరుగ్గా తయారై ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడి గతంలో చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురైన సందర్భాలు లేకపోలేదు. ఇరువైపులా ప్రధాన కాలువలు నిర్మాణం జరిగినప్పటికీ కాలువల పైన సిమెంట్ కప్పులు వేసి మరి రోడ్డును ఆక్రమించుకొని పలువురు వ్యాపారస్తులు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న పంచాయతీ సిబ్బంది..

కాలువల పైన పలకలు వేయడంతో పాటు రహదారిని కూడా ఆక్రమిం చుకొని వ్యాపారాలు కొనసాగి స్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారస్తులు తమ వ్యాపార సౌలభ్యం కోసం రోడ్డును ఆక్రమించుకొని షాపులలో ఉండవలసిన సామాగ్రిని రోడ్డుపైనే ఉంచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత ఆర్ అండ్బి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ పలు వురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్బి, పంచా యతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆక్రమణకు గురైన రహదారితో పాటు పేరుకుపోతున్న మురుగు కూపాలు తొలగించడా నికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


ఆక్రమణలు తొలగించాలంటూ హద్దులు ఏర్పాటు....

మండల కేంద్రంలోని ప్రధాన రహదారులను ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై కట్టడాలు, షెడ్లు, శాశ్వత నిర్మాణాలను వెంటనే స్వచ్ఛం దంగా తొలగించుకోవాలని ఆక్రమణదారులకు హెచ్చరించారు. వాహ నదారులకు ఎదురౌతున్న ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారులపై జరుగు తున్న ప్రమాదాలను వాణిజ్య దుకాణదారులు గ్రహించి, సామాజిక బాధ్యతగా ఆక్రమణలను పాల్పడకుండా సహకరించాలని సూచిం చారు. డ్రైనేజీ ఆక్రమణలపై అక్రమణ దారులు స్వచ్ఛందంగా తొలగిం చాలని రోడ్డు కిరువైపులా డ్రైనేజీల పై హద్దులు నిర్ణయించారు, నోటీ సులు ఇచ్చి ప్రచారాలతో హడావుడి చేసిన పంచాయతీ సిబ్బంది ఆక్రమ ణలు తొలగించడం మర్చిపోయారు. హడావుడి తతంగమంతా పరిశీ లించిన ప్రజలు కలెక్టర్ సారు మీరైనా దృష్టి సారించి ఆక్రమణలు తొల గించి ప్రజా సమస్యల పరిష్కరించాలని కోరుతున్నారు.

ఓ పోలీస్ అన్నా..సెంటర్ ట్రాఫిక్ సంగతేంటి?

-కూసుమంచిలో నడిరోడ్డుపై బైక్ పార్కింగ్, నిత్యం వాహనదారులకు తిప్పలు
-ఊరు బయట చలాన్ల తనిఖీలు..
సెంటర్లో ట్రాఫిక్ సమస్యపై పట్టింపేదీ..?
-పోలీసుల తీరుపై మండల ప్రజలు ఆగ్రహం
-ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డిమాండ్





ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. నడిరోడ్డుపై ఇష్టారాజ్యంగా బైక్లు పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు ఇరుకైన మార్గంలోనే వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా పోలీసులు ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఊరు బయటే చలాన్ల తనిఖీలు..?

కూసుమంచి ఊరు బయల ఎంఎల్పి కార్యాలయం, శివాలయం, కంకరమిల్లు, పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తూ చలాన్లు విధిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, హెల్మెట్ నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం విధుల్లో భాగమే అయినప్పటికీ, గ్రామం నడిబొడ్డున ప్రజలను ఇబ్బంది పెడుతున్న ట్రాఫిక్ సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలి

ప్రధాన సెంటర్లో రహదారిపై అడ్డంగా నిలిపే ద్విచక్ర వాహనాలను క్రమబద్ధీకరించాలని, బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ను నియంత్రించా లని ప్రజలు కోరుతున్నారు. రహదారిపై వ్యాపారాల వల్ల ఏర్పడుతున్న అడ్డంకులను ఆర్అండ్బి అధికారులతో సమన్వయం చేసుకుని తొలగిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఊరు బయల వాహన తనిఖీలు ఎంత ముఖ్యమో, ఊరి మధ్యలో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం కూడా అంతే ముఖ్యమని మండల ప్రజలు పేర్కొంటు న్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కూసుమంచి సెంటర్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

దీపావళి టపాసుల దుకాణాలను ప్రారంభించిన ఎంఎల్పి కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ః పాల్వంచలో దీపావళి టపాసుల విక్రయ దుకాణాలను శనివారం కొత్తగూడెం ఎంఎల్పి కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి టపాసులు విక్రయదారులు దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విక్రయశాలలు ఇరుకు ఇరుకుగా ఉండకుండా విశా లంగా ఉండేలా చూసుకోవాలని గాలి వెలుతురు సజువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విక్రయకేంద్రాల వద్ద టపాసులు కాల్చే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచన బోర్డులు ప్రదర్శించాలని తెలిపారు. ప్రజలు, చిన్నపిల్లలు సైతం దీపావళి మందుగుండు సామాగ్రి కాల్చే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని, కళ్లకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కళ్లజోళ్లు పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు సంభవించిన అత్యవసర సమ యాల్లో ఫైర్ సిబ్బంది 101 నెంబర్కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం ఆయన ప్రజ లందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు దీపావళి షాపుల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/చుంచుపల్లిః దీపావళి పండుగను పురస్కరించుకుని చుంచుపల్లి మండల ప్రజలకు తహశీల్దార్ నాగరాజు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలు గులు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ పండుగను ఆనందోత్సాహా లతో జరుపుకోవాలని, బాణాసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించి ప్రమాదా లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు బాణాసంచా కాల్చే సమ యంలో పెద్దలు దగ్గరుండి పర్యవేక్షించాలని, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో టపా సులు కాల్చరాదని, ఇళ్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలని సూచించారు. నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని, మండే స్వభావం కలిగిన వస్తువులకు దూరంగా బాణా సంచా కాల్చాలని మండల ప్రజలను హెచ్చరించారు. పర్యావరణానికి హాని కలగకుండా, ఇత రులకు ఇబ్బంది కలగకుండా బాధ్యతాయుతంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలని కోరారు.

పశుగ్రాసం సాగుకు వంద శాతం ప్రభుత్వ ఆర్థికసాయం

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ః ఎలినినో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు 100 శాతం ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పశుగ్రాసం సాగుచేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన తెలిపారు. వివి జి రామ్ జి పథకం క్రింద పశుగ్రామసం అభివృద్ధి కార్యక్రమంతో పాటు పశువులు మేకలు గొర్రెల తాగునీటి తొట్ల నిర్మాణానికి అవకాశం ఉందన్నారు. రైతులు వ్యక్తిగత భూముల్లో ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పశుగ్రాసాన్ని సాగుచేసుకోవ చ్చని తెలిపారు. ఐదు ఎకరాలకంటే తక్కువ భూమి కిలిగి నీటి సదుపాయం ఉన్న వారు ఈ పథ కానికి అర్హులని తెలిపారు. అవసరైన ఎరువులు విత్తనాలు ఇతర వ్యవసాయ సామాగ్రి ఖర్చులతో పాటూ కూలీ ఖర్చులు కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎక ఎకరాకు అంచనా వ్యయం రూ.18882గా నిర్ణయించారని తెలిపారు. అదే విధంగా నీటి తొట్ల నిర్మాణానికి సైతం రూ.43000 అందిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం గ్రామపంచాయితీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విపత్తుల సేవలు అందించిన ఫ్రంట్లైన్ సిబ్బందికి సన్మానం



ప్రజాపక్షం/భద్రాచలం ః గోదావరి విపత్కర పరిస్థితులు గణేష్ నిమజ్జనాలు దుర్గామాత నిమజ్జనాల సమయంలో ధైర్య సాహసాలు ప్రదర్శించి సేవలు అందించిన ఫ్రంట్ లైన్ సిబ్బందిని శనివారం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ తన ఛాంబర్లో సన్మానించారు. విపత్కర పరిస్థితుల్లో సహా యక చర్యల్లో అంకితభావంతో పనిచేయడం ఈ ప్రాంతా నికే గర్వకారణం అన్నారు. గజీతగాళ్లు కుమ్మర సత్య నారాయణ కారుకు ప్రసాద్ పారిశుధ్య కార్మికురాలు సుదాల కౌసల్య సామంతుల పుష్ప ఆశా వర్కర్ గొర్రుముచ్చు రమాదేవి హోమ్గార్డు పానుగండి రమేష్ అగ్నిమాపక సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిఏఓ భగవాన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం




ప్రజాపక్షం/మధిరః వర్తక సంఘంలో వేంచేసి ఉన్న శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి శనివారం అన్నదానం జరుగుతుంది. అన్నదాత లుగా చలువాది నాగేశ్వరరావు, చంద్రా వతి దంపతులు సముద్రాల సీతారామ య్య జ్ఞాపకార్థం, కృష్ణమూర్తి, అంజలి దంపతులు కాలం వీరభద్రరావు, శిరే ఖల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్మోహన్రావు, వెచ్చ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్యులు రాని ఆయుర్వేద ఆసుపత్రి!

-రోగులకు అందని ప్రభుత్వ వైద్యం..పట్టించుకోని అధికారులు?
-ఉదయం తలుపులు తీయడం..సాయంత్రం మూసివేయడమే సరి!
-గతంలో ఫార్మసిస్టు గైర్హాజరు..
ఏళ్ల తరబడి జీతాలు పొందినట్లు ఆరోపణలు
-నాడు 100పైగా ఓపీ.. నేడు రోగులే కరువు





ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్య సేవలకు దూరమవుతోంది. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నెలల తరబడి విధులకు హాజరుకాకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఉదయం ఆసుపత్రి తలుపు తీయడం.. సాయంత్రం మూయడం జరుగుతుంది. ఈ తలుపులు కూడా ఎవరు తీస్తారో ఎవరికి తెలియని పరిస్థితి. ఏ ఒక్క వైద్య అధికారి గానీ, ఫార్మసిస్టు గానీ, సిబ్బంది గానీ ఎవరు విధులు హాజరు కాక నేటికి నెలలు గడుస్తుంది. ప్రజలు ఈ ఆసుపత్రికి రావడం కూడా మర్చిపోవడం జరిగింది. ఈ ఆయుర్వేద ఆసుపత్రి ప్రజలకు ఉపయోగపడకపోవడం పట్ల మండల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో డాక్టర్ కటకం శ్రీనివాసరావు వైద్యుడిగా విధులు నిర్వహించిన సమయంలో రోజుకు 100కు పైగా ఓపీలు నమోదయ్యేవి, మండలంలోని వివిధ గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి కూడా రోగులు వచ్చి వైద్యసేవలు పొందేవారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. నాడు రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రి నేడు వైద్యుల అందుబాటు లేమితో వెలవెలబోతోందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆసుపత్రికి నెలల తరబడి వైద్యులు గైర్హాజరుతో రోగులకు వైద్యం నిలిచిపోయింది. గతంలో పని చేసిన ఫార్మాసిస్ట్ సైతం విధులకు హాజరుకాకుండానే ఏళ్ల తరబడి జీతాలు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధులకు హాజరు, సిబ్బంది పనితీరు, జీతాలు చెల్లింపులను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాల్సిన ఆసుపత్రి ఇలా నిరూపయోగంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, ఓపి రికార్డులు, మందులు నిల్వలు, గతంలో ఫార్మాసిస్ట్ హాజరు వివరాలు, హాజరు నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు రెగ్యులర్‌గా వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



ప్రజాపక్షం/కల్లూరుః ప్రభుత్వ ఆసుపత్రుల లోని మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ఏఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఇచ్చిన పిలుపు మేరకు కల్లూరు లోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యశాల నందు శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల వేతనాన్ని నెలకు 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. నవంబరు 12 వ తేదీ నుండి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని గత ఐదేళ్లుగా చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని గత ఐదేళ్ల క్రితం టెండర్లు పిలిచిన సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తక్కువ వేతనాలు అందుతున్నాయని వారు వాపోయారు. కాంట్రాక్ట్ గడువు ముగిసి రెండు ఏళ్ళు అవుతున్న కొత్త టెండర్ల పిలవకపోవడం వేతనాలు పెంచకపోవడం లాంటి అధికారుల నిర్లక్ష్య తీరును విమర్శించారు. కార్మికుల వేతనాలు పెంపు చట్టబద్ధమైన సెలవులు అమలు కోరుతూ దశల వారి ఆందోళనలను చేపడతామని వారు పేర్కొన్నారు. చట్ట ప్రకారం ఏడాదికి 23సెలవులు మంజూరు చేయాలని చట్టాలు ఉన్న అవి అమలు కావడం లేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కరించే అంతవరకు ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని వారి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి వేము రాంబాబు, ఆస్పత్రి కార్మికుల జిల్లా నాయకురాలు ఎం. రమాదేవి, కార్మికులు ఉబ్బన ప్రమోదు, నల్లగట్ల మేరీ,కృష్ణ, స్వరూప, కోటేశ్వరి, జాన్ బి, నాగమణి, సరోజి పాల్గొన్నారు.

వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విరాళం



పదో తరగతి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు రిటైర్డ్ ఏడివో కొత్త జగన్నాధరావు ఔదార్యం

ప్రజాపక్షం/వైరాః విద్యారంగాన్ని పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉన్నత ఆశయంతో వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ఏడివో కొత్త జగన్నాధరావు లక్ష రూపాయలు నగదు విరాళంగా అందజేశారు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం ప్రధానోపాధ్యాయులు వసమా సీతారామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ పూర్వ గౌరవ అధ్యక్షులు, వైరా వాస్తవ్యులు, కొత్త జగన్నాధరావు ఈ విరాళాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ధాత కొత్త జగన్నాధరావు మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలోనే చదువుకుంటున్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష రూపాయలను పాఠశాల పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ నగదు బహుమతులు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ అధ్యక్షులు చల్లా కృష్ణారావు మాట్లాడుతూ తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, అదే పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కొత్త జగన్నాధరావు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆయన సేవా భావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసమా సీతారామారావు, సీనియర్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు భూరి విరాళం అందించిన కొత్త జగన్నాధరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించేలా ఉపాధ్యాయులందరూ కృషి చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ గౌరవ అధ్యక్షులు పైడిపలిల సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు టివి.కృష్ణయ్య సూరి, ఆర్థిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'రిషి రామ్'కు స్వర్ణ పతకం

జాతీయ స్థాయికి ఎంపిక





ప్రజాపక్షం/పెనుబల్లి: కరాటే రింగులో పెనుబల్లికి చెందిన విద్యార్థి తన మార్షల్ ఆర్ట్స్ ప్రతిభతో సత్తా చాటాడు. పెనుబల్లి బీసీ కాలనీ నివాసి భూక్యా రిషి రామ్ నాయక్ తెలంగాణ పాఠశాల క్రీడల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అద్భుత ప్రదర్శనతో గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో ఆయన జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న రిషి రామ్, కరాటే మాస్టర్ బాలకృష్ణ వద్ద కఠోర శిక్షణ పొందాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో తన కిక్కులు, వ్యూహాలతో ప్రత్యర్థులను చిత్తు చేసి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. విద్యతో పాటు క్రీడల్లో జాతీయ స్థాయికి అర్హత సాధించిన రిషి రామ్ నాయక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ సమక్షంలో అధ్యాపకులు ఘనంగా అభినందించారు. రాబోయే జాతీయ పోటీల్లోనూ రాణించి మన ప్రాంత కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని ఆకాంక్షించారు. రిషి రామ్ సాధించిన విజయం పట్ల స్థానికులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దాడికి గురైన వ్యక్తినే అదుపులోకి తీసుకున్నారంటూ ఆగ్రహం



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం ఃి తిరుమలాయపాలెం మండలం సుద్దవాగు తండాలో దాడి ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామానికి చెందిన బాణోతు మోహన్ ఇంట్లోకి శుక్రవారం తెల్లవారుజామున చొరబడిన కొందరు వ్యక్తులు మోహన్‌తో పాటు ఆయన భార్యపై దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడికి గురైన మోహన్‌నే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న గ్రామస్తులు మోహన్‌ను విడుదల చేయాలని దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాజకీయ పలుకుబడితో దాడులకు పాల్పడితే సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ సెంట్రల్ బ్యాంక్‌డైరెక్టర్ చావా వేణుగోపాల్‌కృష్ణ, బాణోతు మోహన్, బాణోతు వెంకన్న, బాణోతు రమేష్, బానోతు పాచ్చనాయక్, బానోతు దేశీయ, మల్లికార్జున్, బానోతు తార, బానోతు గంగ, బానోతు సరోజి, ధరవాత్ లీల, వినోద్, బుజ్జి, శ్రీదేవి, పూలమ్మ, లలిత, గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెరకు సాగుకు ఊతం.. టన్నుకు రూ.3,800



ప్రజాపక్షం/నేలకొండపల్లి : చెరకు సాగును ప్రోత్సహించే దిశగా మధుకాన్ షుగర్ యాజమాన్యం 202627 గానుగ సీజన్‌కు టన్ను చెరకు ధరను రూ.3,800గా ప్రకటించింది. ఈ మేరకు శనివారం మండలంలోని రాజేశ్వరపురం రైతు వేదికలో చెరకు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుకాన్ షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య మాట్లాడుతూ, రైతులంతా అధిక విస్తీర్ణంలో చెరకు సాగు చేసి కర్మాగారానికి ఎక్కువ మొత్తంలో చెరకు సరఫరా చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం టన్ను చెరకుకు రూ.3,382.92 ఉండగా, మధుకాన్ యాజమాన్యం అదనంగా రూ.207.08 ప్రకటించింది. వీటితో పాటు 202526 చెరకు నాటు సీజన్‌లో మొక్క, పిలక తోటలకు ఇచ్చే రాయితీని కలుపుకొని టన్నుకు సగటున రూ.210 చొప్పున పరిగణనలోకి తీసుకున్నారు. ఈ మొత్తాలన్నింటినీ కలిపి టన్ను చెరకు ధరను రూ.3,800గా ఖరారు చేసినట్లు వెల్లడించారు. గత రెండేళ్లుగా కర్మాగారానికి గానుగ కోసం తక్కువ మొత్తంలో చెరకు సరఫరా అవుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని నామా కృష్ణయ్య తెలిపారు. అయినప్పటికీ రైతుల కష్టసుఖాలు తమకు తెలుసని, తాము కూడా రైతు కుటుంబం నుంచే వచ్చామని పేర్కొన్నారు. రైతులు యాజమాన్యానికి సహకరించి చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. ఈ నెల 16న ముహూర్త కార్యక్రమం నిర్వహించి, నవంబర్ 19 నుంచి చెరకు గానుగ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మధుకాన్ షుగర్స్ ఏవీపీ కోటయ్య, డీజీఎం కేన్ అప్పారావు, ఏజీఎం హెచ్‌ఆర్ నరేష్‌తో పాటు పలువురు చెరకు రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ చింతకాని మండల కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/చింతకాని : యూటీఎఫ్ చింతకాని మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జిడిఎస్ రమణ, తోటకూరి శ్రీనివాసరావు ఎన్నిక య్యారు. శనివారం జరిగిన చింతకాని మండల యూటీఎఫ్ మహాసభలో వీరి ఎన్నిక జరిగింది. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం రెండవ పిఆర్సీ నివేదిక తెప్పించుకుని వెంటనే అమలు చేయాలని , ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చింతకాని మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుతో పాటు కోశాధికారిగా ఉదారపు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా భాగ్య, ప్రీతం ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షలు షేక్ రంజాన్, కోశాధికారి వల్లంకొండ రాంబాబు, కార్యదర్శి సురేష్ , మండల యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.